www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 12 జనవరి 2024
5
కాకినాడ



ఉపాధి కల్పనపై వెబ్ పోర్టల్ ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ

యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఉపాధి కల్పనా అధికారులతో కలిసి నూతనంగా రూపొందించిన ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో సేవలు, ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతలు నమోదు సులభతరం చేసే విధంగా employment.ap.gov.in వెబ్ సైట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. దీనిపై మరిన్ని వివరాలకు 0884- 2373270 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి.శ్రీనివాసు రావు తెలిపారు.

ఎస్మాను రద్దు చేసి డిమాండ్లు నెరవేర్చాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-కాకినాడ

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 31 రోజుల నుంచి పోరాడుతున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఎస్మాను తక్షణమే ఉపసంహరించి సమ్మె నివారణకు చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో అంగన్వాడీల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సిపిఎం సీనియర్ నాయకులు దువ్వా శేషబాబ్జి, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు జె.వెంకటేశ్వర్లు, సిపిఐ (ఎంఎల్) జిల్లా నాయకులు గొడుగు సత్యనారాయణ, ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా వరప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లూరు రాజు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి అదనంగా చెల్లిస్తానని అంగన్వాడీలకు జగన్ ఇచ్చిన మాటను అమలు చేయాలని కోరుతూ గత 30 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల నిర్బంధాన్ని ప్రయోగించేందుకు ఎస్మా చట్టాన్ని జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. తక్షణం అంగన్‌వాడీలపై విధించిన ఎస్మాని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా నోటీసు ఇచ్చి సమ్మె చేస్తున్న అంగన్వాడీలతో అయిదుసార్లు చర్చలు జరిపిన ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడం మానేసి ఎస్మా విధించడాన్ని తప్పు పట్టారు. గతంలో ఎస్మాను ఉద్యోగులపై ప్రయోగించిన ప్రభుత్వాలన్నీ అధికారాన్ని కోల్పోయారన్నారు. 2019 నుంచి 2024 లోపు మన రాష్ట్రంలో నిత్యావసరాలు ధరలు 300 శాతం పెరిగాయని, అలాంటప్పుడు అంగన్వాడీల జీతాలు పెంచమని అడగడంలో తప్పేముందని ప్రశ్నించారు. మహిళా సాధికారత గురించి ప్రగల్బాలు పలికే జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల పట్ల హృదయంలేని మనిషిగా వ్యవహరిస్తున్నారన్నారు. నూతనంగా తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీలకు రూ.18000 వేతనం చెల్లిస్తుంటే, మన రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రూ.11500 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కె.ఎస్.శ్రీనివాస్, సిహెచ్.అజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం అఖిలపక్ష పార్టీల నాయకులంతా అంగన్వాడీల నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించి వారి పోరాటానికి మద్దతు ప్రకటించి ప్రసంగించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్


సమ్మె శిబిరం వద్ద మద్దతు తెలుపుతున్న నాయకులు


లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న కలెక్టర్, ఎంపీ

జగనన్న తోడు నిధుల విడుదల

ప్రజాశక్తి-కాకినాడ

చిరు వ్యాపారులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం ద్వారా మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం కింద ఎనిమిది విడతలో చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి బ్యాంకుల ద్వారా రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణాలను బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి ఎంపి వంగా గీత, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి హాజరయ్యారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేశారు. మహిళలు ప్రదర్శించిన వస్తు ఉత్పత్తులను పరిశీలించి స్వయంగా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతివృత్తులు, చిరు వ్యాపారాలు చేసుకునే మహిళలకు ఆర్థిక సహకారాన్ని అందించాలని లక్ష్యంతో జగనన్న తోడు ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకం ద్వారా ఎనిమిది విడతలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 10,995 మంది లబ్ధిదారులకు రూ.11.12 కోట్లు, పట్టణ ప్రాంతాలకు చెందిన 5,906 మంది లబ్ధిదారులకు రూ. 6.76 కోట్లు రుణాలు మంజూరైనట్లు తెలిపారు.

విఎస్ఆర్ స్టడీ సెంటర్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి కాకినాడ

పూర్వ ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు, మార్క్సిస్టు నాయకులు వాసంశెట్టి సూర్యారావు స్మారకంగా యువతీ, యువకులకు, సామాజిక, సాంస్కృతిక కార్యకర్తలకు విద్యా, వైజ్ఞానిక, రాజకీయ విద్య నెరపడం కోసం విఎస్ఆర్ ఐడియల్ స్టడీ సెంటర్ ప్రారంభమయ్యింది. దీని లోగోను వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ గురువారం ఆవిష్కరించారు. ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి), జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ సూర్యారావు ఆశయానికి అనుగుణంగా స్టడీ సెంటర్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ సంస్థల అభీష్టానికి అనుగుణంగా సాగుతున్న నేటి విద్యా విధానం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నాయని, స్వతంత్రంగా ఆలోచించే నైపుణ్యం కొరవడి పరాయీకరణ చెందుతున్న మనుషులకు ఒక మార్గం చూపాల్సిన అవసరం నెలకొన్న పరిస్థితుల్లో ఇటువంటి స్టడీ సెంటర్ ప్రారంభించడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్తలు పెద్దింశెట్టి రామకృష్ణ, వి.రవికుమార్, సిహెచ్.కిరణ్ కుమార్, జి.చెల్లారావు, కార్మిక సంఘాల నాయకులు వి.చంద్రరావు, జి.రామకృష్ణ, కె.ప్రసాద్, సత్యనారాయణరెడ్డి, రచయిత ప్రకాశరావు పాల్గొన్నారు. లోగోను ఆకర్షణీయంగా డిజైన్ చేసిన బాలం హరికి అభినందనలు తెలిపారు.


లోగోను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి ఐవి తదితరులు

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా రవి

ప్రజాశక్తి- కాకినాడ రూరల్



ఎపి కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాయుడుపాలెంకు చెందిన లింగం రవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రూరల్, సిటీ నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు రవికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లింగం రవి మాట్లాడుతూ తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన సిఎం వైఎస్.జగన్, ఎంఎల్‌ఎ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో సమస్యలపై చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలోని గిరిజన ప్రాంతాలోల మూడు రోజులపాటు పర్యటించినట్టు ఎస్‌టి కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. గురువారం జెఎన్‌టియుకె అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పర్యటన వివరాలను వెల్లడించారు. ప్రత్తిపాడు మండలం గిరిజనాపురంలో ప్రజలుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని, ఆ గ్రామంలో 40 మంది ప్రజలు ఉన్నారని ఆయన తెలిపారు. ఆ గ్రామంలో 9.1/2 ఎకరాల గిరిజన భూమిని ఎవరో రాయించుకుని వారిని అక్కడ నుండి పొమ్మని బెదిరిస్తున్నారని తెలిపారు. అక్కడ సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. వంతాడ, పాండవులపాలెం గ్రామాలలో పర్యటించామన్నారు. వంతాడలో మైనింగ్ జరుగుతోందని, ఆ గ్రామంలో సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎ.విజయశాంతి, గిరిజన నాయకులు భానుచందర్, డాక్టర్ మధు, నరసింహులు, మల్లేష్, హనుమాన్ నాయక్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

జూదాలు, కోడి పందేలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

సంక్రాంతి పండుగ సందర్భంగా జూదాలు, కోడిపందేలపై నిషేధం ఉందని, ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్‌తో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా కోడి పందేలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. ఈ విషయంలో ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. పోలీసులు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, పంచాయతీ అధికారులు, సంబంధిత సమన్వయ శాఖ అధికారులు కోడిపందేల నిర్వాహకులపై దృష్టి సారించి విస్తత దాడులు చేసి, కేసులు నమోదు చేయాలని కలెక్టర్ కతికాశుక్లా సూచించారు. పొలాల్లో బరులు వేసే యజమానులపై కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. వీటికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను చిత్రీకరించి ఆధారాలను సేకరించి సంబంధిత సమన్వయ అధికారులు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎస్‌పి సతీష్ కుమార్ మాట్లాడుతూ కోడి కత్తులు తయారు చేసేవారిని బైండోవర్ చేయాలని, గుండాట, పేకాటలపై నిషేధం ఉందని తెలిపారు. ఆర్‌డిఒలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ఆర్‌టిఒ సురేష్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆర్.సురేష్ జిల్లా రోడ్డు రవాణా అధికారిగా ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ విజయవాడ కమిషనరేట్‌లో రిపోర్టు చేసిన తర్వాత పండుగ సెలవుల అనంతరం జిల్లా మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపడతానన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ యాత్ర

ప్రజాశక్తి-గండేపల్లి

గ్రామ సచివాలయాల్లో శుక్రవారం నుంచి భారత సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ బిఎస్-ఎస్‌కె రామన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో భారత సంకల్పయాత్ర అనే కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపట్టే 17 సంక్షేమ పథకాలు గురించి ఆయా గ్రామ ప్రజలు, లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమం మండల స్థాయి అధికారులు గ్రామస్థాయి అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం 17 పథకాల గురించి స్టాల్స్ ఏర్పాటు చేసి ఆయా శాఖల వారి అధికారులు లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఈ నెల 24 వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని తెలిపారు.

17న పెద్దాపురం మండల సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపిడిఒ బి.అశోక్ కుమార్ తెలిపారు. ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల పరిధిలోని 23 గ్రామాల అభివృద్ధిపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉద్యోగులు, మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

శాంతి వర్ధన సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పెద్దాపురం

వికలాంగ బాలలకు శాంతి వర్ధన వికలాంగుల పాఠశాల చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎస్ఐ వి.సురేష్ అన్నారు. పులిమేరులోని శాంతివర్ధన వికలాంగుల పాఠశాలలో గురువారం నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. 40 మంది గర్భిణులకు బిబివిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో వస్త్రాలు, పౌష్టికాహార పదార్థాలు పంపిణీ చేశారు. 75 మంది వృద్ధులకు దుప్పట్లు, టవల్స్ అందజేశారు. ముగ్గురు ట్రాన్స్ జెండర్లకు వస్త్రాలు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఎస్ఐ సురేష్ కె.సత్యనారాయణ, కంచర్ల దేవి, శాంతి వర్ధనా పాఠశాల నిర్వాహకును అభినందించారు. సంస్థ డైరెక్టర్ ఆర్.వీరబాబు, ఎఒ వేణుగోపాల్, బాబి, శాంతి వర్ధన, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ సురేష్

31వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. వారికి పలు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం


కాకినాడ అంగన్‌వాడీలకు మద్దతుగా ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి అంగన్‌వాడీ సమ్మె శిబిరం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ పట్ల ప్రభుత్వం మొండివైఖరి చాలా దారుణమన్నారు. సమ్మె 31వ రోజుకి చేరినా ప్రభుత్వం దున్నపోతు మీద వర్షం కురిసిన చందంగా వ్యవహరి స్తోందన్నారు. పెరు గుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచమంటే ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ఉద్యోగాలు తీసేస్తామని బెదిరింపులకు దిగడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మొగలి బేబీ, మలక నాగలక్ష్మి, చెక్కల వేణి,రత్న కుమారి, వరలక్ష్మి, బి.వరలక్ష్మి, సుగుణ, నవకుమారి పాల్గొన్నారు. **కాజులూరు** కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు సమ్మె శిబిరంలో మాట్లాడారు. సెక్టర్ లీడర్లు అన్నవరం, హనుమావతి, వరలక్ష్మి సునీత, భవాని, సలాది లక్ష్మి, నందికోళ్ల నాగమణి, శేషారత్నం రాయుడు సీత పాల్గొన్నారు. **కరప** సమ్మె శిబిరంలో అంగన్వాడీ ప్రాజెక్టు నాయకురాలు పి.వీరవేణి మాట్లాడారు. ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవ కుమారి, ఆశారత్నం, కల్పలత, సత్య మాధవి. ఎం.భవాని, నారాయణమ్మ, మంగతాయారు, సరోజిని, జ్యోతి, కల్పలత, పి.లక్ష్మి, ఎ.దేవి, బి.మనోజ, లక్ష్మి, సాయి దుర్గ, బి.భవాని పాల్గొన్నారు. **పిఠాపురం** తహశీల్దారు కార్యాలయం వద్ద సమ్మె 31వ రోజు నేపథ్యంలో అంగన్‌వాడీలు 31వ సంఖ్య మాదిరిగా కూర్చుని నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు కె.చిన్న ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి డి తులసీదేవి మాట్లాడారు. నాయకులు విజయశాంత, నళిని, ప్రజావాణి, బేబీ, నాగగనిక, సత్యవతి, భవాని, గౌరి, వెంకటలక్ష్మి, అమల సూర్యకాంతం పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ సెంటర్‌లో సమ్మె శిబిరం వద్ద యుటిఎఫ్ జిల్లా నాయకులు విజయగౌరి మాట్లాడారు. జెవివి రాష్ట్ర నాయకులు బి.అనంతరావు, సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్, ఎన్ సూరిబాబు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కేదారి నాగు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. దాడి బేబీ, నాగమణి, అమల, ఎస్తేరు రాణి, బాలం లక్ష్మి, టిఎల్.పద్మావతి, లోవ తల్లి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, వన కుమారి, తులసి పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** ఒ.సత్యవతి, జి.బేబీరాణి, కె.అన్నపూర్ణ, హేమలత మాట్లాడారు. ఖోఖో ఆడి నిరసన తెలిపారు.


కాకినాడలో అంగన్‌వాడీలకు మద్దతుగా ఆశా వర్కర్ల ధర్నా


పిఠాపురంలో 31 ఆకారంలో కూర్చొని నిరసన


పెద్దాపురంలో..

కార్టూ'నిజం'



'అంబేద్కర్' చిత్ర ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా పేర్కొన్నారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై గురువారం కలెక్టరేట్‌లో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన ఈ ఛాయా చిత్రాల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. అంబేద్కర్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, రాజ్యాంగ రచన, వివిధ ఘట్టాలకు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఎంపీ వంగాగీత, ఎంఎల్‌సికర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జెడ్‌పి సిఇఒ ఎ.వెంకట రమణారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, డిపిఒ కె.భారతి సౌజన్య, విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి ఇతర జిల్లా స్థాయి అధికారులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిన అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేలా సిఎం వైఎస్.జగన్ ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల విగ్రహం, అంబేద్కర్ సేవలకు ప్రతిరూపంగా నిర్మించిన స్మృతి వనాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 09 నుంచి 12 తేదీ వరకు గ్రామ సచివాలయం, మండలం, జిల్లా స్థాయిల్లో జన్ భగీదర్ కార్యక్రమం కింద అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తారని, పాఠశాల విద్యార్థులకు అంబేద్కర్ జీవిత విశేషాలపై అవగాహన పెంపొందిస్తూ వివిధ పోటీలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయ స్థాయిలో అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేసి ఘనంగా నివాళులర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి డి.నాగార్జున, దళిత సామాజికవేత్త పెట్టా వరప్రసాద్, సాంఘిక సంక్షేమ జెడి డివి.రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహ నాయక్, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్, ఎంపీ తదితరులు

లౌకికవాద పార్టీలను కలుపుకుని వెళ్తాం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రానున్న ఎన్నికల్లో లౌకికవాద భావజాలం కలిగిన పార్టీలను కలుపుకునే ముందుకు వెళతామని కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు అన్నారు. గురువారం ఏలేశ్వరంలో రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు, ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఉమ్మిడి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోడీ సర్కార్ మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తోందన్నారు. సిఎం వైఎస్.జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటు పడిందన్నారు. ఏలేరు, సుబ్బారెడ్డి సాగర్ ఆధునీకరణ పనులు నిలిచిపోవడం వల్ల సాగు, తాగునీటికి భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్, కార్మిక సంక్షేమ బోర్డు నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, నాయకులు మల్లిపూడి శ్రీ రామ చంద్రమూర్తి, పెద్దాడ సుబ్బారాయుడు, తేజోమూర్తుల ఉషారాణి, ఎం.సూర్యప్రకాశరావు, యనుముల నరసింహమూర్తి దొర, పిల్లా ప్రదీప్, ఉమ్మిడి సురేష్, పాత బత్తుల పెద్దబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు

నేరాలు ఘోరాలు

విరవాడలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలో విరవాడలో బుధవారం రాత్రి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు విరవాడ గ్రామంలో ఎస్.అప్పారావు తన భార్య చిన్ని, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. అప్పారావు కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఖమ్మంలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తుండగా అప్పారావుకు గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఎన్.సురేష్ పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వీరి మధ్య స్నేహం కొనసాగింది. పది రోజుల క్రితం వీరిద్దరి మధ్య ఏదో విషయమైన వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి సురేష్ విరవాడలోని అప్పారావు ఇంటికి వచ్చాడు. ఇంట్లోనే కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. పిఠాపురం సిఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

277 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరంలోని వెలమపేటలో కోడికత్తులు తయారు చేస్తున్న ఎదురాడ వెంకటరమణను అరెస్టు చేసి, అతని నుంచి 277 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శివనాగబాబు తెలిపారు. ఎస్పి జగదీష్ ఆదేశాల మేరకు, నార్త్ జోన్ ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో స్పెషల్ బ్రాంచి సిబ్బందితో దాడులు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు.

2 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

అక్రమంగా తరలిస్తున్న 2 టన్నుల రేషన్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లాకు చెందిన కడలి లక్ష్మణ్ రాజానగరంలోని కోళ్ల ఫారాలకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జొన్నాడ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారని ఎస్ఐ తెలిపారు.

100 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రానున్న సంక్రాంతి, ఎన్నికల నేపథ్యంలో 100 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ నాగార్జునరాజు గురువారం తెలిపారు. సంక్రాంతి సందర్భంగా గతంలో కోడిపందేలు, జూదాలు, మద్యం, సారా, గంజాయి అమ్మకాలు నిర్వహించిన వారిని గుర్తించి బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గత ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్ల కేసులో ఉన్న వారందరినీ గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

పోక్సో కేసులో 10 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ

ప్రేమ పేరుతో మోసగించిన గొల్ల అమర్‌రాజ్‌కుమార్‌కు కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు పదేళ్ళ కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారని టుటౌన్ ఎస్‌హెచ్‌ఒ తెలిపారు. 2016లో అన్నమయ్య జిల్లా రాజంపేట గ్రామానికి చెందిన గొల్లా అమర్ రాజ్ కుమార్ అలియాస్ కోనేటి కుమార్ కాకినాడలో ఉంటూ 2016లో 16 ఏళ్ల మైనర్‌ను ప్రేమపేరుతో మోసం చేశాడు. దీనిపై కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పడి డిఎస్‌పి సూర్యదేవర వెంకటేశ్వరరావు దర్యాప్తు చేసి నిందితుని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితునికి పదేళ్ళ జైలు విధించారు. నిందితుడు గొల్లా అమర్‌రాజ్‌పై పలు జిల్లాల్లో చోరీ కేసులు కూడా ఉన్నాయి. చోరీల కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి ఐదేళ్లుగా కోర్టుకు రాకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో నిందితునిపై నాన్ బెయిలబుల్ వారెంట్‌సైతం ఉంది. నిందితుడిని పట్టుకున్న కాకినాడ టూ టౌన్ పోలీసును ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం 216 జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. యానాం వైపు నుంచి వస్తున్న కారు, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులను ఢీకొంది. ఈ ప్రమాదంలో కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి సుదర్శన్, అమలాపురానికి చెందిన సూర్య, రాజమహేంద్రవరానికి చెందిన కె.లలిత్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కోరంగి పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలాకి చేరుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బిక్కవోలు

చెట్టుకు ఉరేసుకుని ఒక వ్యక్తి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బిక్కవోలు గ్రామ శివారు లింగాల చెరువు గట్టుపై ఉన్న చెట్టుకు ఒక గుర్తి తెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందాడు. చెరువు కాపలాదారుడైన తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మాదే పాతయ్య ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ బుజ్జిబాబు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుందన్నారు. మృతిని శరీరంపై ఎరుపు రంగు బనియన్, పచ్చరంగు షర్ట్ ఉందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అనంతపల్లికి చెందిన వెలగన నాగేశ్వరరావును నాటు సారా విక్రయిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఇబి సిఐ డి.సుధ తెలిపారు. అతని నుంచి 20 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎస్ఇబి అధికారులు, సిబ్బంది పి,సుధీర్, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

జిల్లావ్యాప్తంగా గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

సామర్లకోట రూరల్ పెదబ్రహ్మదేవంలోని త్రివర్ణ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ తోటకూర వెంకటేశ్వరరావు భోగి మంటను వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు.



సామర్లకోట రూరల్‌లో..

పెద్దాపురం స్థానిక రామారావు పేట లోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సిహెచ్.విజయ ప్రకాష్, సమీ, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్.మూర్తి, ప్రొఫెసర్ సంతానం భోగి మంటను వెలిగించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు. **తాళ్లరేవు** పైడా విద్యాసంస్థల ఆధ్వర్యంలో సాంప్రదాయ బద్ధంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. కాకినాడ సీ. పోర్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం. మురళీధర్, జిల్లా పరిశ్రమల శాఖ ఐపిఒ పివి సూర్యప్రకాష్ సంబరాలను ప్రారంభించారు. పైడా విద్యాసంస్థల చైర్మన్ పైడా సత్య ప్రసాద్, సెక్రటరీ పైడా శ్రీరామ్, నిత్య శ్రీరామ్, డీన్ వీరభద్రరావు, డిడి రవీందర్ రెడ్డి ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు. ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో పి.మల్లవరంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వాలీబాల్ పోటీలను ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ ప్రారంభించారు. ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడారు. వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వడ్డి ఏడుకొండలు, అత్తిలి బాబూరావు, నాయకులు దున్నా రాంబాబు, రెడ్డి బాబు, కాలా సూరిబాబు, బర్రె లక్ష్మీ నరసింహ రాజు పాల్గొన్నారు.



తాళ్లరేవులో..



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు

రజక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

ఎపి రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను గురువారం కలెక్టరేట్లో బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వృత్తిదారుల సంఘం ఐక్యతకు చిహ్నంగా క్యాలెండర్‌ను రూపొందించుకోవడం అభినందనీయమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వృత్తులు స్వయం పోషకాలని తద్వారా ఆర్థిక వృద్ధి పెరుగుతుందన్నారు. వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు, ప్రధాన కార్యదర్శి కొజ్జవరపు నాగేశ్వరరావు, పెదపూడి చంటి, కొజ్జవరపు మాణిక్యం, సత్యవాడ బాబ్జి, శీరందాసు రాజేష్, పొన్నాడ సూర్యనారాయణ, గార అప్పారావు, వెదురుపాక రాజు, పోలిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడు జోగారావు కన్నుమూత

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

భీమేశ్వర ఆలయంలో ప్రధాన అర్చకుడు కొంతేటి జోగారావు(73) గురువారం స్థానిక పిఠాపురం రోడ్డులోని ఆయన గృహంలో మృతి చెందారు. ఉదయం 9 గంటలకు అస్వస్థత గురైన జోగారావును ఆసుపత్రికి తీసుకెళ్లడానికి సన్నద్ధమవుతుండగా ఇంట్లోనే తుది శ్వాస విడిచారు. ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి, అన్నదాన ట్రస్ట్ నాయకుడు బిక్కిన సాయి, చీమల కొండ వీరభద్ర ప్రసాద్, నోరి కృష్ణారావు, కటకం రాంబాబు తదితరులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

చెక్‌పోస్టుల్లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

కాకినాడ జిల్లా సరిహద్దు కేంద్ర పాలిత ప్రాంతం యానాం, కోనసీమ ప్రాంతం వద్ద చెక్ పోస్టలను ఎస్‌పి ఎస్. సతీష్ కుమార్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సరిహద్దు జిల్లాల నుండి కాకినాడ జిల్లాలో ప్రవేశించే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయడం కోసం మల్లవరంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ అమలు తీరును పరిశీలించారు. ఆయన వెంట డిఎస్‌పిలు పి.మురళీ కృష్ణారెడ్డి, చవ్వాకుల శ్రీరామ కోటేశ్వరరావు, ట్రైనీ ఎస్‌పి నవజ్యోతి మిశ్రా తదితరులు ఉన్నారు.



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పిఠాపురం

తమ సమస్యలు పది రోజుల్లోగా పరిష్కరించాలని లేకుంటే తిరిగి సమ్మెలోకి వెళ్తామని సిఐటియు నాయకులు కె.చిన్న, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణకు వర్కర్లు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో హెల్త్ అలవెన్స్ విడిగా ఇచ్చేవారని, అలవెన్స్‌తో కలిపి రూ.21 వేల వేతనం ఇస్తామని, మట్టి ఖర్చులు రూ.25 వేలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.ఏడు లక్షలు ఇస్తామని తదితర అంశాలపై ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. దీంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలు అమలు అయ్యేలా చూడాలన్నారు.



సత్కరిస్తున్న సహోద్యోగులు

రైల్వే ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే స్టేషన్లో అసిస్టెంట్ పాయింట్స్ మాన్ రాజేష్ కుమార్ సింగ్‌కు సీనియర్ పాయింట్స్ మాన్‌గా భీమవరం స్టేషన్‌కు బదిలీ చేయడంతో గురువారం స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, పలువురు సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న జెఎసి నాయకులు

హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించామని సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు ఎం.చంటిబాబు తెలిపారు. తమ ప్రధాన డిమాండ్లైన హెచ్‌ఆర్ పాలసీ అమలకు మంత్రుల కమిటీని నియమిస్తున్నట్లు చెప్పారు. సమ్మె జయప్రదానికి సహకరించిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, మీడియా మిత్రులకు, పోలీసులు, సిఐటియు నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేసారు.

క్రీడల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఈ నెల 4, 5, 6 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపి మూడు బంగారు పతకాలు సాధించారని ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.సాంబశివరావు బాలుర షార్ట్‌పుట్‌లో, వివిఎల్.కృష్ణతులసి బాలికల షార్ట్ పుట్‌లో, జి.శ్రీవల్లిక 400 మీటర్ల బాలికల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారని ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌టివివిఎస్.కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు మార్చిలో సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

రెండో రోజు న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2022 రద్దు కోరుతూ న్యాయవాదులు ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో రెండో రోజు నిరసన దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం న్యాయవ్యవస్థను రెవెన్యూ పరిధిలోకి తీసుకురావడం ద్వారా పెత్తందారులకు లాభం కలిగించేందుకే నల్ల చట్టాన్ని తీసుకొచ్చింది అన్నారు. చట్టం రద్దు అయ్యే వరకు తమ పోరాటం విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బొంగుళూరి మదుబాబు, న్యాయవాదులు పిల్లి బలరాముడు, అచ్యుతరామారావు, బత్తుల రవికుమార్, పలివెల నాగేంద్ర ఉన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రత్యేక కృషి చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన అర్బన్ బజార్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులు అమ్మడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జూదాలకు వ్యతిరేకంగా సదస్సులు

ప్రజాశక్తి - పెద్దాపురం

సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందేలు, గుండాటలు, అసభ్య డాన్సులు వల్ల కలిగే నష్టాలు వివరిస్తూ పోలీసు,ా రెవెన్యూ అధికారులు గురువారం పెద్దాపురం మండల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించారు. మండల పరిధిలోని పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, గుడివాడ, కట్టమూరు, జె.తిమ్మాపురంలో ఎస్ఐ వి.సురేష్, తహశీల్దారు జితేంద్ర ఆధ్వర్యంలో ఈ సదస్సులు నిర్వహించారు. జూదాలు, కోడిపందేల వల్ల కలిగే నష్టాలు, గొడవలు, ఆర్థిక నష్టాలు, చట్టాలు వంటి వాటిపై ప్రజలకు వివరించారు.

'రా.. కదలిరా' సభ విజయవంతం

ప్రజాశక్తి-కాకినాడ

రా కదిలి రా పేరుతో తునిలో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం అయిందని దీనికి సుమారు లక్షమంది పైగా వచ్చారని టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. గురువారం కాకినాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న కాలంలో టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. తమ ప్రభుత్వం ద్వారా సంక్షేమ, సురక్ష పాలన ప్రజలకు అందుతుందన్నారు. వైసిపి నాయకులు నాలుగేళ్ల 8 నెలల పాలనలో రాష్ట్రాన్ని అథః పాతాళంలోకి తోసేశారని చెప్పారు. సంక్షేమం పేరుతో ప్రజలపై భారాలు వేశారన్నారు. మద్యం, విద్యుత్ నిత్యావసర ధరలు విపరీతంగా పెంచేసారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, తూము కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కన్నబాబు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి దినపత్రిక ఎనలేని కృషి చేస్తోందని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రజాశక్తి దినపత్రిక 2024 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదాన్ని నిలబెట్టుకుంటూ వాస్తవాలను నిర్భయంగా అక్షర రూపంలో ప్రజలకు అందిస్తూన్న ఏకైక దినపత్రిక ప్రజాశక్తి అని ప్రశంసించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యారెడ్డి

ఇఒపిఆర్‌డిల జిల్లా అధ్యక్షునిగా సత్యారెడ్డి

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

పంచాయతీరాజ్ విస్తరణాధికారుల (ఇఒపిఆర్‌డి)ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని జిల్లా విస్తరణాధికారి సంఘం అధ్యక్షుడు కర్రి హరికృష్ణ సత్యారెడ్డి పేర్కొన్నారు. సత్యారెడ్డి కాకినాడలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీరామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కె.విసూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా సిహెచ్.ఇందిరాదేవి, కోశాధికారిగా ఎస్‌వి.శ్రీనివాసరావు, సహాధ్యక్షునిగా జి.అరుణ్ కుమార్ ఎన్నికైనట్లు చెప్పారు. సత్యారెడ్డిని సామర్లకోట ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, జెడ్‌పిటిసి ఎలిశెట్టి అమృతా నరేష్ తదితరులు అభినందించారు.

16 నుంచి జాతీయ నాటికల పోటీలు

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని భోగాపురంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జాతీయ స్థాయి ద్వితీయ నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు భోగాపురం కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు తెలిపారు. 16న విశాఖ చైతన్య కళాస్రవంతి (అ)సత్యం నాటిక, భద్రం ఫౌండేషన్స్ మట్టి పరిమళం నాటిక ప్రదర్శిస్తామన్నారు. నాటక ప్రయోక్త దర్శకుడు రచయిత కీర్తి శేషులు మలిరెడ్డి బాబీ స్మారక ప్రతిభా పురస్కారాన్ని సఖినాల బ్రహ్మానందంకు అందజేస్తామన్నారు. 17న అమరావతీ ఆర్ట్స్ గుంటూరు వారి అమృతహస్తం నాటిక, కట్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి విముక్తి నాటిక, గుంటూరు అమృతలహరి వారి నాన్నా నేనొచ్చేస్తా నాటిక ప్రదర్శిస్తామన్నారు. అదే రోజు నంది గరుడ అవార్డుల ఉత్తమనటి సోమిశెట్టి అమృత వర్షిణికి నట విధూషీమణి విశిష్ట నటనా పురస్కారం అందిస్తామన్నారు. 18న వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి రాత నాటిక, హైదరాబాద్ శ్రీ జయ ఆర్ట్స్ వారి ఎనిమిదో అడుగు నాటిక, కొండెవరం మణికంఠ ఆర్ట్స్ వారి ఖరీదు నాటిక ప్రదర్శిస్తామని,అడపా మాణిక్యం, అచ్చియ్యమ్మ స్మారక జీవిత సాఫల్య పురస్కారాన్ని నడుడు పద్మనాభ కళాపరిషత్ నిర్వాహకుడు బుర్రా పద్మనాభం, సావిత్రీదేవిలకు అందిస్తామన్నారు.

సుబ్రహ్మణ్యానికి పరిమి బాబు పరామర్శ

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లికి చెందిన టిడిపి యువ నాయకుడు పసుమర్తి సుబ్రమణ్యం ఇటీవల రోడ్డు ప్రమాదంతో గాయపడడంతో ఆయనను గురువారం సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి బాబు పరామర్శించారు. యోగక్షేమ అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట సుంకవల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

యానాం వార్తలు



వాలంటీర్లతో ట్రాఫిక్ ఎస్ఐ

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం


ప్రజాశక్తి - యానాం

ట్రాఫిక్ నిబంధనలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్రస్వామి అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో 25 మంది వాలంటీర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ ఎస్ఐ హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడుపరాదన్నారు. చిన్నారులకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపరాదన్నారు. ద్విచక్ర వాహనాలను హెల్మెట్ లేకుండా, కారును సీట్ బెల్టు లేకుండా నడుపరాదన్నారు. అతివేగంతో వాహనం నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందంపై చర్చలు విఫలం

ప్రజాశక్తి - యానాం

రైస్ మిల్ కార్మికులు రైస్ మిల్స్ యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. రెండేళ్ల క్రితం చేసుకున్న నూతన వేతన ఒప్పందం 2023 నవంబర్‌తో పూర్తయ్యింది. అయినా నూతన వేతన ఒప్పందానికి మిల్లు యాజమాన్యం స్పందించలేదు. కార్మాకులు ఈ విషయాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం అసిస్టెంట్ లేబర్ కార్యాలయంలో చర్చలు జరిపారు. కార్మికుల డిమాండ్లకు యాజమాన్యం సరిగా స్పందించలేదని దుర్గాప్రసాద్ తెలిపారు. కార్మికుల శ్రమతో రూ.కోట్లు పోగేసుకుంటున్నారన్నారు. కాని కార్మికులకు మాత్రం కనీస వేతనం ఇవ్వట్లేదన్నారు. జనవరి 17న మరోసారి చర్చలు ఉన్నాయన్నారు. అక్కడ కూడా న్యాయం జరగకపోతే సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైస్ మిల్ యాజమాన్యం తరపున దుర్గాప్రసాద్ చౌదరి, చిన్నబ్బాయి కార్మికుల తరపున సిఐటియు కన్వీనర్ కుంచే సత్యనారాయణ,జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ కార్మికులు సలాది నాగబాబు, తిరుకోటి శ్రీను, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, సూరిబాబు, సబ్బతి రాంబాబు, రాజు, సువర్ణ రాజు, సత్తిబాబులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న సిబ్బంది

9వ రోజుకు ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - యానాం

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ చేపట్టిన సమ్మె గురువారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. 13 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు 44 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఆసుపత్రి సిబ్బందికి ప్రముఖ న్యాయవాది ఖాదర్ షేక్ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 13 సంవత్సరాల క్రితం అవుట్ సోర్సింగ్ సిబ్బంది గా ఆసుపత్రిలో 47 మందిని ప్రభుత్వం తీసుకుందన్నారు కరోనా సమయంలోనూ ప్రాణాలను పణంగా పెట్టి వారు సేవలందించారన్నారు. వారికి రావాల్సిన బకాయి జీతాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు.

యానాం కోర్టులో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యానాం

యానాం సబ్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం న్యాయమూర్తి రాజ్‌మోహన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.స్థానిక త్యాగరాజ వీధిలో గల కోర్ట్ ప్రాంగణంలో ఈ వేడుకలు జరిగాయి. సిబ్బంది, న్యాయవాదులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. భోగిమంటలు, రంగవల్లులతో పల్లె వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో న్యాయవాది మాజేటి నటరాజన్, కోర్టు పిపి సలాది శ్రీనివాస్, న్యాయవాదులు కమిడి విజయకుమార్, నడింపల్లి శ్రీనివాసరాజు, భాషా, రామకిష్ణ, స్వరాజ్యలక్ష్మి, భ్రమరాంబిక, మోక్షిత, నారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

యానాం డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయని అసోసియేషన్ అధ్యక్షులు, సెక్రటరీ కాపగంటి సుమన్, చింతా వెంకన్న తెలిపారు. గురువారం అండర్-14, 16 బాల బాలికలకు రన్నింగ్, షాట్ పుట్, జంపింగ్ తదితర పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ క్రీడాకారులు సిఐఎస్ఎఫ్ రిటైర్డ్ ఎస్‌పి తొత్తరమూడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నక్కల సుబ్బన్న, చింతం రామకృష్ణ, పాలిక ప్రకాష్, జల్లి చంద్ర శేఖర్, సన్యాసిరావు, ఐవికె.మోహన్, సత్యనారాయణ, అథ్లెటిక్ కోచ్ పబ్బినీడి శేఖర్ పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - కిర్లంపూడి

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగ్గంపేట మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంను కిర్లంపూడిలో ఆయన నివాసం గురువారం కలిశారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని జరిగే మహా కుంభాభిషేకానికి ముద్రగడను ఆహ్వానించేందుకు వచ్చానని నెహ్రూ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తున్న తరుణంలో తనకు మద్దతు తెలపాలని ముద్రగడను కోరానని తెలిపారు. ముద్రగడ వ్యక్తిగతంగా తనకు సంపూర్ణ మద్దతు తెలుపుతానన్నారని నెహ్రూ చెప్పారు. జనసేన నాయకులు కలవడం, జ్యోతుల నెహ్రూ ముద్రగడను కలవడంతో వారి బేటీకి రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఆర్‌బికెల పనితీరుపై 'ఆదిత్య' సర్వే

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ రైతు భరోసా కేంద్రాల పనితీరుపై సర్వే నిర్వహించింది. నాయకంపల్లిలో యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.రఘునాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు గురుఆవరం సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా విద్యార్థులు రైతుల వద్దకు వెళ్లి ప్రభుత్వం వారు ఇచ్చిన సర్వే నివేదిక ఆధారంగా ప్రశ్నలకు రైతుల సమాధానాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంకా ఏమి ఆశిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల పనితీరు అందులో పని చేస్తున్న సిబ్బంది సేవలు తదితర వివరాలు తెలుసుకున్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ రఘునాథ్ మాట్లాడుతూ గతంలో కూడా ఎన్ఎస్ఎస్. ద్వారా పలు సర్వేలు నిర్వహించామన్నారు.